
సాక్షి గుంటూరు

శనివారం ၊ 13 ၊ సెప్టెంబర్ ၊ 2025



బొడ్రాయికి ప్రత్యేక పూజలు

గుంటూరు రూరల్: వరుస మరణాలతో హడలెత్తిపోతున్న తురకపాలెం గ్రామ ప్రజలు బొడ్రాయికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 68,340 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 89,306 క్యూసెక్కులు వదులుతున్నారు.

తెనాలిలో రేషన్ షాపు సీజ్



తెనాలిరూరల్: తెనాలి సాలిపేటలో ఉన్న 39వ నంబర్ రేషన్ దుకాణాన్ని సీజ్ చేసినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ శుక్రవారం తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదుల మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా ఫిర్యాదులు వాస్తవం అని తేలడంతో షాపు సీజ్ చేసినట్టు తెలిపారు.

న్యూస్‌రీల్

ఐ అండ్ పీఆర్ డీడీగా రమేష్



గుంటూరు వెస్ట్: జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ డెప్యూటీ డైరెక్టర్‌గా లోచర్ల రమేష్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల కాలం వరకు ఇక్కడ పనిచేసిన మొహమ్మద్ రఫీక్ గతనెలలో ఉద్యోగ విరమణ పొందారు. అప్పటి నుంచి డీపీఆర్వో శ్యామ్‌కుమార్ ఆ బాధ్యతలు నిర్వహించారు. రమేష్ బాధ్యతలు స్వీకరించారు. రమేష్ 1996 ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా సహాయ పౌర సంబంధాల అధికారిగా ఎంపికై హైదరాబాద్, విశాఖపట్నం, పాడేరు, శ్రీకాకుళం, పార్వతీపురం తదితర ప్రాంతాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు.

ఉమ్మడి జిల్లాకు 2,660 మెట్రిక్ టన్నుల యూరియా



కొరిటెపాడు(గుంటూరు): ఉమ్మడి గుంటూరు జిల్లాకు ఐపీఎల్ కంపెనీకి చెందిన 2,660 మెట్రిక్ టన్నుల యూరియా శుక్రవారం సరఫరా అయ్యాయి. స్థానిక రెడ్డిపాలెం రైల్వేస్టేషన్ రేక్ పాయింట్‌కు వ్యాగన్ల ద్వారా చేరిన యూరియాను గుంటూరు ఏడీఏ, రేక్ అధికారి ఎన్.మోహనరావు పరిశీలించారు. వీటిలో గుంటూరు జిల్లాకు 1200 మెట్రిక్ టన్నులు, పల్నాడు జిల్లాకు 760 మెట్రిక్ టన్నులు, బాపట్ల జిల్లాకు 700 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు మోహనరావు తెలిపారు. గుంటూరు జిల్లాకు వచ్చిన 1,200 మెట్రిక్ టన్నులలో మార్క్‌ఫెడ్‌కు 900 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డీలర్స్‌కు 300 మెట్రిక్ టన్నులు యూరియా సరఫరా చేయనున్నట్లు ఏడీఏ మోహనరావు వివరించారు.

విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి భౌతికకాయం వితరణ



తెనాలి: అమ్మ ఐ ఆర్గాన్ అండ్ బాడీ డొనేషన్ ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ సహకారంతో మృతిచెందిన ఒక వ్యక్తి కళ్లు, భౌతికకాయాన్ని దానం చేసినట్టు సంస్థ తెనాలి కో–ఆర్డినేటర్ నండూరి నారాయణరావు తెలియజేశారు. గుంటూరుకు చెందిన 73 ఏళ్ల వయసు గల ప్రభుత్వ ఉద్యోగి కొత్తపల్లి హరిబాబు శుక్రవారం మృతిచెందారు. ఆయన భార్య అపర్ణరాణి, కుమార్తె బీకే దీప్తి సమ్మతితో హరిబాబు నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంక్‌కు, భౌతికకాయాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనల నిమిత్తం కాటూరి మెడికల్ కాలేజికి అందజేసినట్టు నారాయణరావు తెలిపారు. ఈ సత్కార్యానికి సంస్థ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు గంజి ఈశ్వరలింగం అభినందించారని వివరించారు.

పీజీ కోర్సుల ఫలితాలు విడుదల

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో జూలైలో జరిగిన పీజీ కోర్సుల రెండవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాదరావు శుక్రవారం విడుదల చేశారు. ఎంఎస్సీ బయోటెక్నాలజీలో 32 మందికి 32 మంది, ఎమ్మెస్సీ సాయిల్ సైన్స్ అండ్ అగ్రికల్చరల్ కెమిస్ట్రీలో 15 మందికి 12 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంఎస్సీ సైకాలజీలో 24 మందికి 21 మంది, ఎంఎస్సీ ఫోరెన్సిక్ సైన్సెస్‌లో 24 మందికి 24 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. వీరిలో ఎవరైనా రీవాల్యుయేషన్ కోసం ఈనెల 22వ తేదీలోగా ఒక్కొక్క పేపరుకు రూ.1860 చెల్లించి పరీక్షల కోఆర్డినేటర్‌కు దరఖాస్తులు అందేలా పంపాలని ఆలపాటి శివప్రసాదరావు సూచించారు.

కనకదుర్గమ్మ సేవలో పల్నాడు కలెక్టర్ దంపతులు

భవానీపురం (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ వారిని కలెక్టర్ దంపతులు దర్శించుకున్నారు. నూతనంగా నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా హిమాన్షు శుక్లా, పల్నాడు జిల్లా కలెక్టర్‌గా కృతికా శుక్లా నియమితులైన నేపథ్యంలో శుక్రవారం వారు కుటుంబసభ్యులతో కలిసి శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి విచ్చేశారు. వారికి ఆలయ కార్యనిర్వహణాధికారి వీకే శీనానాయక్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులతో వేదాశీర్వచనం చేయించారు. అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

వాస్తవాలు చెబుతోందనే 'సాక్షి'పై అక్రమ కేసులు



తెలుగు ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తున్న సాక్షిపై కూటమి సర్కారు అక్కసు వెళ్లగక్కుతుంది. ప్రతిపక్ష నేతలను, ప్రజల పక్షాన మాట్లాడే సాక్షిని నోరు మూయించే ఉద్దేశంతో వ్యవహరిస్తున్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పిన విధంగా 'ఇస్ ద ప్రెస్ ఇన్ ద హ్యాండ్.. ఈజీ టు మ్యానుఫ్యాక్చర్ ద గ్రేట్ మాన్' అనే మాటలు చంద్రబాబు, లోకేష్ విషయంలో నిజమయ్యాయి. చంద్రబాబు పాలనలో చేసిందేమీ లేకపోయినా ఏదో అద్భుతాలు జరుగుతున్నట్లు చూపిస్తున్నారు. ప్రజలకు ఇవన్నీ సరికాదని చెబుతున్నందుకు సాక్షిపై అక్రమ కేసులు పెడుతున్నారు. కూటమి ప్రభుత్వం తప్పులు సరిచేసుకోకుండా కక్ష సాధింపు చర్యలకు దిగడం సిగ్గుచేటు. అక్రమ కేసులు, అరెస్టులు సాక్షిని ఏమీ చేయలేవు.

– మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ



మీడియా స్వేచ్ఛను హరించాలనుకోవడం సిగ్గుచేటు



ప్రశ్నించే హక్కు, తప్పొప్పులను వెలికితీసే హక్కు సమాజంలో మీడియాకు ఉంది. వారి హక్కులను, స్వేచ్ఛను హరించేలా వ్యవహరిండం సిగ్గుచేటు. సాక్షి దినపత్రిక ఎడిటర్‌తోపాటు పలువురు జర్నలిస్టులపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో అక్రమంగా కేసులు బనాయించి విచారణ పేరుతో పిలుస్తుండటం మంచిది కాదు. ఏమైనా లోపాలుంటే వివరణ ఇస్తే సరిపోతుంది, కానీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ రాజకీయాలు చేయడం వలన ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారో ఆలోచించుకోవాలి. పత్రికా స్వేచ్ఛను కాలరాస్తూ వాక్ స్వాతంత్ర్యాన్ని హరిస్తున్న ఇలాంటి చర్యలను మానుకుంటే మంచిది.

– నందిగం సురేష్, మాజీ ఎంపీ, బాపట్ల

అమరావతి శిల్పాల రాక ఎన్నడో?

- లండన్ మ్యూజియంలో భద్రపర్చిన శిల్పాలు
- 'అమరావతి ఆర్ట్'తో తెరపైకి
- లండన్ స్థాయిలో మ్యూజియం నిర్మించాలి
- 'కొండ'ను సందర్శనీయం చేయాలి



లండన్ మ్యూజియం...అందులోని మన శిల్పాలు

తెనాలి: గుంటూరులో కొద్దిరోజుల కిందట సీనియర్ పాత్రికేయుడు పున్నా కృష్ణమూర్తి రచన 'అమరావతి ఆర్ట్' ధరణికోట–నాగార్జునకొండ శిల్ప సంపదల సచిత్ర వ్యాస సంకలనం ఆవిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు కీలకమైన తీర్మానం చేశారు. రాజధాని ప్రాంతంలో లలిత కళల విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుచేయాలని, అందులో అమరావతి శిల్పకళను పదిలం చేయాలనేది ఆ తీర్మానం. చెన్నైలో, లండన్‌మ్యూజియంల్లో ఉన్న అమరావతి శిల్పసంపదను రప్పించాలని, ఒరిజినల్ శిల్పాలు కాకున్నా నమూనా శిల్పాలనైనా తెప్పించేందుకు కృషి జరగాలని అభిప్రాయపడ్డారు. మన అమరావతి శిల్పసంపదను రప్పించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు.

కదిలినా ప్రయోజనం శూన్యం

వాస్తవానికి ఈ దిశగా గతంలోనే కొంత కదలిక కనిపించినా, జరిగింది మాత్రం శూన్యం. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి పేరిట నామకరణం చేసిన తెలుగుదేశం ప్రభుత్వం, అప్పట్లో రాష్ట్రంలోని బౌద్ధపర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేస్తామని ప్రకటించింది. లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియంలో ఉన్న 'అమరావతి నగర అపురూప శిల్పాలు' వెనక్కి రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని నాడు వార్తలొచ్చాయి. దీనిపై బౌద్ధ అభిమానులు, రాష్ట్ర ప్రజలు సంతోషించారు. కేంద్రంలో నాటి ఎన్డీఏ ప్రభుత్వమే కొలువుదీరింది. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ భాగస్వామిగా గల కూటమి ప్రభుత్వం, ఎన్డీఏలో భాగస్వామిగా తెలిసిందే. ఇప్పటికైనా లండన్ మ్యూజియంలోని శిల్పసంపదను, కనీసం నమూనాలైనా తెప్పించాలనేది అందరి ఆకాంక్ష.

విరాజిల్లిన బౌద్ధం

శాతవాహనుల కాలంలో కృష్ణా తీరాన బౌద్ధం విరాజిల్లింది. ధాన్యకటకం అంటే అమరావతి రాజధానిగా శాతవాహనులు దాదాపు 300 ఏళ్లు సువిశాల సామ్రాజ్యాన్ని పరిపాలించారు. అంతకుపూర్వం అశోకుని కాలంలోనే అక్కడ మహాస్తూపం నిర్మాణం ప్రారంభమై చాలాకాలం కొనసాగింది. అమరావతి స్తూపంలోని పూర్ణఘటం సంపూర్ణ జ్ఞానానికి సంకేతం. దీనినే తర్వాత పూర్ణకుంభంగా మార్చి ఆంధ్రప్రదేశ్ అధికార చిహ్నంగా ప్రకటించారు.

భద్రపర్చిన బ్రిటీష్ పాలకులు

ఈ శిల్పాలను ఫొటోలు తీయించడమే కాకుండా విరిగిపోయిన భాగాలను యథావిధిగా చిత్రాలు గీయించి, భద్రపర్చారు. అక్కడకు తరలించిన శిల్పాల జాబితాను రూపొందించి, అన్నింటికీ ఫొటోలు తీయించారు. లండన్‌లోని మన శిల్పాలపై బీబీసీ డాక్యుమెంటరీ చేసింది. అలాంటి మన వారసత్వ సంపదను అమరావతికి తీసుకొచ్చేందుకు గతంలో అమరావతి డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ జస్టిస్ వీరాంజనేయులు ప్రధాని నరేంద్రమోదీకి లేఖ రాశారు. ఆ ప్రకారం చర్యలు తీసుకోవాలని భారత ప్రభుత్వ సాంస్కృతికశాఖ కార్యాలయం నుంచి పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్‌కు ఆదేశాలు పంపారు. అక్కడితో కథ ఆగిపోయింది. ముందుకు సాగలేదు. మళ్లీ ఇప్పుడు ప్రముఖులు చేసిన తీర్మానం ప్రకారం అమరావతి శిల్పాలను వెనక్కి రప్పించే ప్రక్రియ ఆరంభం కావాలనేది బౌద్ధ అభిమానులు, కళాభిమానుల ఆకాంక్ష.

అమరావతిలోని ఆనాటి శిల్పసంపదను అపురూపమైనవిగా బ్రిటిష్ వలస పాలకులు గుర్తించారు. 1798లో కల్నల్ కొలిన్ మెకంజీ, అతడి సహాయకుడు బెంజిమిన్ సడన్‌హాంలు అమరావతిలోని బౌద్ధస్తూపాన్ని సందర్శించాక, అక్కడి శిల్పాలకు కాళ్లొచ్చాయి. ఆ తర్వాత 1845లో మరోసారి ఇక్కడ తవ్వకాలు చేశారు. సుమారు వందేళ్ల కాలంలో దశల వారీగా ఈ శిల్పాలను మచిలీపట్నం, కోల్‌కతా, చెన్నై, ఢిల్లీకి తరలించి, అక్కడ్నుంచి లండన్‌కు పంపారు. అక్కడి బ్రిటిష్ మ్యూజియంలో 120పైగా శిల్పాలను అమరావతి ఆర్ట్ గ్యాలరీ పేరిట భద్రపరిచారు. మరికొన్ని చెన్నై, కోల్‌కతా, ఢిల్లీ మ్యూజియంలలో ఉన్నాయి.



శిల్ప సంపద

లాంలో ఎన్‌ఆర్‌ఎల్‌ఎమ్ కేంద్ర బృందం పర్యటన



లాంలో గ్రామైఖ్య సంఘాలతో సమావేశమై మాట్లాడుతున్న సెంట్రల్ బృందం సభ్యులు

లాం(తాడికొండ): తాడికొండ మండలం లాం గ్రామంలో శుక్రవారం నేషనల్ లల్లీ హుడ్ మిషన్, ఎస్ఆర్ఎల్ఎం న్యూఢిల్లీ కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. ఎన్ఆర్ఎల్ఎం హెచ్ఆర్ డిపార్ట్‌మెంట్ టీం సభ్యులు లక్ష్మీకాంత్ స్థానిక మహిళా గ్రూపు సభ్యులతో సమావేశమై జీవనోపాధి కోసం చేస్తున్న వ్యాపారాల గురించి తెలుసుకున్నారు. అనంతరం మండల సమాఖ్య సమావేశంలో గ్రామ సమాఖ్య అధ్యక్షులు వీవోఏలతో సమావేశమై పలు వివరాలు అడిగి తెలుసుకొని అభినందించారు. కార్యక్రమంలో ఏపీ సెర్ప్ టీం అధికారులు వాల్మీకి, ఎం శోభ, ప్రభావతి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కుంభా పద్మ, డీఆర్‌డీఏ డీసీఎం శివప్రసాద్‌రెడ్డి, ఐబీ ఏపీఎం జగ్జీవన్‌రామ్, తాడికొండ ఏపీఎం ఆర్ సాంబశివరావు, క్లస్టర్ కోఆర్డినేటర్ పఠాన్ నాగుల్ ఖాన్, సీసీలు, వీవోఏలు సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ అని బోర్డు పెట్టుకుంటే చర్యలు తప్పవు

- ఆర్ఎంపీలు, పీఎంపీలు ప్రథమ చికిత్సకి మించి వైద్యం చేయరాదు
- ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ డి శ్రీహరిరావు హెచ్చరిక



గ్రామంలో పర్యటిస్తున్న ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు వైద్యులు

గుంటూరురూరల్: నగరాలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలో ఎక్కడైనా ఆర్ఎంపీలు, పీఎంపీలు డాక్టర్ అని బోర్డు పెట్టిన అత్యవసర ప్రథమ చికిత్స తప్ప ఏవిధమైన వైద్యం చేసినా చట్టబద్ధ చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ డి.శ్రీహరిరావు హెచ్చరించారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గార్లపాటి నందకిషోర్ తో కలసి తురకపాలెం గ్రామాన్ని సందర్శించారు. స్థానికంగా ఏర్పాటుచేసిన ప్రభుత్వ ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించి, వైద్యుల్ని అడిగి నమోదవుతున్న కేసుల వివరాలు, అందిస్తున్న చికిత్సల గురించి తెలుసుకున్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్ష ఫలితాలను జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, స్థానిక వైద్యాధికారులు వివరించారు. అనంతరం గ్రామంలో పలు వీధులను పరిశీలించిన ఆయన ఏపీ మెడికల్ కౌన్సిల్ విజిలెన్స్ అధికారి డాక్టర్ ఆశాకిరణ్‌తో కలిసి ఆర్ఎంపీలు పీఎంపీల ప్రథమ చికిత్స కేంద్రాలను తనిఖీ చేశారు. పేరు ముందు డాక్టర్ అని పేరు పెట్టుకున్న వారి వివరాలను నమోదు చేసుకున్నారు. వారు రోగులకు ఇస్తున్న మందులను పరిశీలించారు. ప్రథమ చికిత్స కేంద్రాలలో నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో మాత్రమే వాడాల్సిన స్టెరాయిడ్స్, యాంటీబయాటిక్స్‌లను గుర్తించామన్నారు. తురకపాలెంలో చనిపోయిన వారిలో చాలామంది ఈ ప్రథమ చికిత్స కేంద్రాలలో సెలైన్లు, యాంటీబయాటిక్స్ విచక్షణ రహితంగా వాడడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం అందరికీ అందుబాటులో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, క్వాలిఫైడ్ వైద్యులు ఇతర పారామెడికల్ సిబ్బంది ఉండగా ప్రజలు నకిలీ వైద్యుల నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రాలకు వెళ్లడం ఎంత మాత్రం మంచిది కాదన్నారు. దీనివల్ల చిన్నచిన్న వ్యాధులే ప్రాణాంతకంగా పరిణమించే అవకాశం ఉందన్నారు. ప్రజలందరూ ఆరోగ్య విషయాలలో అశ్రద్ధ చేయక ఎలాంటి అనారోగ్య లక్షణాలు కనిపించినా వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గార్లపాటి నందకిషోర్ మాట్లాడుతూ తురకపాలెం గ్రామ ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. తొలిదశలోనే క్వాలిఫైడ్ వైద్యుల్ని సంప్రదిస్తే ఎలాంటి సమస్యలు రావన్నారు. ఐఎంఏ వైద్యులు ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మెడికల్ కౌన్సిల్ చైర్మన్‌తో పాటు తురకపాలెం సందర్శించిన వారిలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ పూర్వ ఉపాధ్యక్షులు, ఐఎంఏ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు డాక్టర్ నాగేళ్ల కిషోర్, ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ టి.సేవా కుమార్, ఐఎంఏ గుంటూరు బ్రాంచ్ అధ్యక్షులు డాక్టర్ వై సుబ్బారాయుడు, ఉపాధ్యక్షులు డాక్టర్ డి అమరలింగేశ్వరరావు, కార్యదర్శి డాక్టర్ బి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తప్పులతడకలుగా రేషన్ కార్డులు

- అయోమయంలో లబ్ధిదారులు
- ఫీజు చెల్లిస్తేనే సరిచేస్తామంటున్న అధికారులు

మంగళగిరి: ప్రభుత్వం జారీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులు తప్పులతడకగా తయారయ్యాయి. లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. ఇంటి నంబర్లతో సహా తప్పులుగా నమోదు కావడం రేషన్ కార్డులు ముద్రింపులో ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో అర్థమవుతుందని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తప్పులు వద్ద కార్డులను ఉచితంగా సరిచేసి ఇస్తామని మంత్రి ప్రకటించినప్పటికీ సిబ్బంది మాత్రం ఫీజు చెల్లిస్తేనే సరిచేసి కొత్త కార్డులు ఇస్తామని చెబుతున్నారని టోల్ ఫ్రీ నెంబర్ పనిచేయడం లేదని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. కుమార్తె మనుమరాలుగా కుమారుడు భర్తగా వరుసలు మార్చి ముద్రించడం లబ్ధిదారులను ఆందోళనకు గురిచేస్తుంది. కొంతమందికి ఆధార్ కార్డులో ఉన్న వయస్సు కంటే తక్కువగా ముద్రించడం గమనార్హం. ఈ తప్పుల వల్ల భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు ఎక్కడ ఆగుతాయోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. మీ సేవా కేంద్రాలకు వెళ్లి సరిచేసేందుకు దరఖాస్తు కావాలని కోరితే తమకు ఇంతవరకు దరఖాస్తులు రాలేదని వారు చెబుతున్నారు. విచిత్రంగా ఆత్మకూరులో డోర్ నెంబర్ 3–335385 అని ఉండడం ఆశ్చర్యానికి గురి చేసింది. 40 సంవత్సరాల వయస్సు ఉన్న ఆదంబికి 43 సంవత్సరాల కుమారుడు ఉన్నట్లు ముద్రించడం గమనార్హం. మంగళగిరి నియోజకవర్గంలో 1,00,209 రేషన్ కార్డులుండగా మంగళగిరిలో 48,205 రేషన్ కార్డులు, తాడేపల్లిలో 31886, దుగ్గిరాలలో 20,118 కార్డులున్నాయి. వీటిలో కనీసం సగానికిపైగా తప్పులతడకలుగా ముద్రించారు. తప్పులను సరిచేసుకోవడానికి కార్యాలయాల చుట్టూ ఎన్ని రోజులు తిరగాలని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తప్పులున్న కార్డులను ఉచితంగా సరి చేసి అందజేయాలని లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



40 సంవత్సరాలు వయస్సుతో ఉన్న షేక్ ఆదింబి రేషన్ కార్డు



కుటుంబసభ్యుల పేర్లలో తప్పులు, డోర్ నెంబర్ 3-335385

నిలిచిన రేషన్ కార్డుల పంపిణీ

తప్పుల తడకగా ఉన్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ శుక్రవారం నిలిచిపోయింది. ఇంటింటికి సచివాలయ సిబ్బంది వెళ్లి పంపిణీ చేస్తారని ప్రభుత్వం ప్రకటనలు గుప్పిస్తున్నా క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు కష్టాలు తప్పడం లేదు. సచివాలయ సిబ్బంది కార్యాలయాల నుంచి కదలకపోగా లబ్ధిదారులను సచివాలయాలకు వచ్చి తీసుకెళ్లాలని చెబుతున్నారు. దీంతో లబ్ధిదారులు సచివాలయాల చుట్టూ తిరుగుతుండగా శుక్రవారం సర్వర్ నిలిచిపోవడంతో కార్డుల పంపిణీ పూర్తిగా నిలిచిపోయింది. లబ్ధిదారులు నిరాశతో వెనుతిరిగారు. లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు అందాయని ఇంటికి వెళ్లి పంపిణీ చేయని సిబ్బందిపై చర్యలు తీసుకుని, లబ్ధిదారులకు ఇంటికి వెళ్లి కార్డులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ దినేష్ రాఘవేంద్ర తెలిపారు.

క్రీడాస్ఫూర్తితో ఆటంకాలను అధిరోహించాలి

- ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు
- క్రీడాకారులకు క్యాష్ అవార్డు ప్రదానోత్సవం



పురస్కారం అందజేస్తున్న వీసీ

పెదకాకాని(ఏఎన్‌యు): క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో జీవితంలో ఎదురయ్యే ఆటంకాలను అధిరోహించాలని వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె గంగాధరరావు అన్నారు. వర్సిటీ పరిధిలో వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు శుక్రవారం వ్యాయామ విద్య విభాగం ఆధ్వర్యంలో నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్ అధ్యక్షత వహించారు.

నగదు పురస్కారాలు అందజేత

వర్సిటీ పరిధిలో 2024 –25 లో సౌత్ వెస్ట్ జోన్ అంతర్ యూనివర్సిటీల మహిళల వెయిట్ లిఫ్టింగ్ 76 కేజీల విభాగంలో బంగారు పతకం, ఆల్ ఇండియా ఇంటర్ జోనల్ ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్ పోటీలలో సిల్వర్ మెడల్ సాధించిన తెనాలి ఏఎస్ఎన్ కళాశాలకు చెందిన టి రేణుకకు రూ.40 వేల నగదు పురస్కారాన్ని అందజేశారు. 71 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన గుంటూరు మహిళా కళాశాలకు చెందిన బి నానికి రూ.12,500, సౌత్ వెస్ట్ జోన్ అంతర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ 61 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్, ఆల్ ఇండియా ఇంటర్ జోనల్ ఇంటర్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్ పోటీలలో బ్రాంజ్ మెడల్ సాధించిన నిడుబ్రోలు పీబీఎస్ కళాశాలకు చెందిన డి మౌనాలికి రూ.32,500, సౌత్ వెస్ట్ జోన్ అంతర్ వర్సిటీ పురుషుల వెయిట్ లిఫ్టింగ్ 96 కేజీల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించిన నగరంలోని ఎస్‌వీఆర్ఎం కళాశాల విద్యార్థి ఎ.అరుణ్ బాబుకు రూ.10,000 నగదు అందజేశారు.

పొగాకు కేంద్రంలో రైతులకు తప్పని కష్టాలు

- సాంకేతిక సమస్యతో రెండురోజులుగా ఎదురుచూపులు
- మీడియాతో మొరపెట్టుకున్నాక, సాయంత్రానికి సమస్య పరిష్కారం



వాహనం దగ్గర పడిగాపులు పడుతున్న రైతులు

తెనాలి: తెనాలిలోని పొగాకు కొనుగోలు కేంద్రంలో రైతులకు కష్టాలు కొనసాగుతున్నాయి. తీసుకొచ్చిన పొగాకును కొనకుండా తిరస్కరించారని కొద్దిరోజుల కిందట రైతులు ఆవేదనతో ఇంటిదారి పట్టిన ఘటన మరువక ముందే యాప్‌లో సాంకేతిక సమస్యతో సంబంధిత రైతులు రెండు రోజులుగా పడిగాపులు కాయాల్సి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. రాష్ట్రంలోని రైతులు పండించిన పొగాకు పంటకు గిట్టుబాటు ధర లేకపోవటంతో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తోన్న విషయం తెలిసిందే. మార్క్‌ఫెడ్ బయ్యర్లను ఏర్పాటుచేసి పొగాకు కొనుగోళ్లను చేయిస్తోంది. ఈ క్రమంలో పొగాకు పండే ప్రాంతాల్లో గొడౌన్లు ఖాళీ లేకపోవటంతో తెనాలిలోని రాష్ట్ర ప్రభుత్వ వేర్‌హౌసింగ్ గిడ్డంగిలో ఈనెల ఒకటో తేదీ నుండి పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఆరంభించింది. పొగాకు పండించే గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల్లో పొగాకు రైతులకు షెడ్యూలు ఇచ్చి, విడతలవారీగా ఏయే కొనుగోలు కేంద్రానికి ఎప్పుడు పొగాకు తీసుకెళ్లాలనేది మెసేజ్‌లను పంపుతున్నారు. పొగాకు నాణ్యత ప్రకారం కొనుగోలు చేస్తున్నారు.

నాణ్యత లేదని తిరస్కరణ

నాణ్యత లేదనే కారణంగా కారంచేడు, చీరాల ప్రాంతానికి చెందిన పలువురి రైతుల పొగాకు బేళ్లను బయ్యర్లు ఇటీవల తిరస్కరించారు. ఈ నేపథ్యంలో అధికారుల సమాచారం ప్రకారం కారంచేడు మండలం జరుబులవారిపాలెం, కొడవలివారిపాలెం గ్రామాల నుంచి పొగాకును తీసుకుని వచ్చిన మైనేని సంజీవరావు, కంచర్ల రెబెక్కాలకు ఇక్కడ చుక్కెదురైంది. మార్క్‌ఫెడ్ యాప్‌లో లాగిన్ కావటం లేదంటూ కొనుగోలు చేయలేదు. వీరి సరుకును కనీసం వాహనంలోంచి దించుకోవాటినికి కూడా అనుమతించలేదు. దీనితో రెండురోజులుగా అధికారులు చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేదని శుక్రవారం మీడియాతో మొరబెట్టుకున్నారు.

సాంకేతిక సమస్య

మార్క్‌ఫెడ్ రాష్ట్ర కార్యాలయంలో సాంకేతిక సమస్య కారణంగా ఈ అవాంఛనీయ పరిస్థితి తలెత్తిందని, సమాచారం ఇచ్చామని అధికారులు రైతులకు సచ్చజెబుతూ వస్తున్నారు. వీరితో పాటు వచ్చిన మరో రైతు పరిస్థితి కూడా ఇలాగే ఉంది. తమ గ్రామంనుండి వంద కిలోమీటర్ల దూరంలోని తెనాలికి తీసుకువచ్చిన తమకు రూ.10 వేలకు పైగా రవాణా ఛార్జీలు అయినట్టు చెబుతున్నారు. ఇంత దూరంలో కొనుగోలు కేంద్రం కేటాయించటం, ఇక్కడా సరుకు అమ్మకానికి అవకాశం లేకుండా ఇబ్బంది పెట్టటం భావ్యమైనా అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఎట్టకేలకు శుక్రవారం సాయంత్రానికి వీరి ఆవేదనకు తెరపడింది. మార్క్‌ఫెడ్ కార్యాలయం అధికారులు సాంకేతిక సమస్యను తొలగించారు. రైతుల పేర్లు లాగిన్ కావటంతో వారి పొగాకును కొనుగోలు చేశారు. దీనితో ఆయా రైతులు, మీడియాకు, అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్-టీచింగ్ సిబ్బందికి పదోన్నతులు



అసోసియేషన్ సభ్యులతో విశ్వవిద్యాలయం అధికారులు

గుంటూరురూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నాన్-టీచింగ్ సిబ్బందికి పదోన్నతులు అందించటం సంతోషకరమని నాన్ టీచింగ్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. శుక్రవారం నగర శివారు లాంలోని విశ్వవిద్యాలయంలో జరిగిన సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం స్థాపితమైన 1964 నుండి, ఇలాంటి భారీ సంఖ్యలో బోధనేతర సిబ్బందికి పదోన్నతులు ఇవ్వడం ఇదే మొదటిసారి కావడం విశేషమన్నారు. పదోన్నతులకు సహకరించిన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఆర్ శారదజయలక్ష్మిదేవి, రిజిస్ట్రార్ డాక్టర్ జి రామచంద్రరావు ఇతర ఉన్నతాధికారులకు అసోసియేషన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వెంకటేశ్వరరావు, ప్రెసిడెంట్ అశోక్, అసోసియేట్ ప్రెసిడెంట్ సతీశ్, జనరల్ సెక్రటరీ శివరామకృష్ణ, తదితరులున్నారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల ఆందోళన

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్లకు వినతి పత్రాలు



గుంటూరు తూర్పు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్థిక పరమైన సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఏపీటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గుంటూరు జిల్లాలో ఉపాధ్యాయులు ఆందోళనలు కొనసాగించారు. నిరసనవారంలో భాగంగా శుక్రవారం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 60 మండలాల పరిధిలో తహసీల్దార్లకు మెమోరాండం సమర్పించినట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవ లింగారావు, మొహమ్మద్ ఖాలీద్ తెలిపారు. ఆయా మండలాల వారీగా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో ఉపాధ్యాయులతో కలిసి ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొనగా, గుంటూరు తూర్పు, పశ్చిమ మండల తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిర్వహించిన నిరసన ప్రదర్శనల్లో బసవ లింగారావు, ఎండీ ఖాలీద్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఉపాధ్యాయులకు సంబంధించిన ఆర్థిక పరమైన డిమాండ్లను నెరవేర్చేందుకు కృషి చేయాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న బకాయిల విడుదలకు రోడ్ మ్యాప్ షెడ్యూల్ ప్రకటించాలని, లేని పక్షంలో ఈనెల 13,14వ తేదీల్లో ప్రజా ప్రతినిధులందరినీ కలిసి మెమోరాండంలను సమర్పిస్తామని తెలిపారు. నిరసన ప్రదర్శనల్లో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పుట్టా జనార్ధనరావు, పి.పార్వతి, సత్యనారాయణమూర్తి, కార్యదర్శి జి.దాస్, రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్‌బాషా, నాయకులు గడ్డిపాటి శివరామకృష్ణ, బి.సాయిలక్ష్మీనారాయణ, సీహెచ్ లక్ష్మణ్‌కుమార్, చక్కా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

నెహ్రూనగర్: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే డిమాండ్‌తో శుక్రవారం మార్కెట్ సెంటర్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. క్రాంతికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలు వలే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర గడిచినప్పటికీ రక్షణ చట్టం ఊసే లేదన్నారు. చట్టసభల్లో 33 శాతం, నామినేటెడ్ పదవుల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని మరో వాగ్దానం ఇచ్చినప్పటికీ ఇంతవరకు అతీగతి లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు మూడు నెలల ముందే నిర్వహిస్తామని ఎన్నికల కమిషన్ చెబుతుంటే.. మరోపక్క ఇంతవరకు బీసీల కులగణన చేపట్టకపోవడం చూస్తుంటే బీసీలను అన్యాయం చేయడమే అన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, పారేపల్లి మహేష్, కోలా అశోక్, కొల్లూరు హనుమంతరావు, ముప్పన వెంకటేశ్వర్లు, తురక రమేష్, కోలా మణికంత, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు



ఎం.ధనలక్ష్మి జిల్లా అధ్యక్షురాలు



ఏ.వి.ఎన్ కుమారి ప్రధాన కార్యదర్శి

లక్ష్మీపురం: ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) గుంటూరు జిల్లా 10వ మహాసభలో అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి పలు తీర్మానాలు చేసినట్లు ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు జి రమణ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ధనలక్ష్మి, ఏవీఎన్ కుమారి తెలిపారు. పాతగుంటూరు సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు గత 42 రోజుల సమ్మె విరమణ సందర్భంగా చేసిన ఒప్పందంలో భాగంగా తక్షణమే జీతాలు పెంపుదల చేయాలన్నారు. ధరల పెరుగుదల కనీస వేతనాలను దృష్టిలో ఉంచుకొని రూ.26 వేలు జీతం ఇవ్వాలని తీర్మానం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఆదాయ పరిమితి ఉన్నప్పటికీ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు విడో పెన్షన్, తల్లికి వందనం, రేషన్ కార్డులు, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ తదితర సంక్షేమ పథకాలు వర్తింపజేయకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో తక్షణమే నిర్ణయం చేసి అంగన్‌వాడీలందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని తీర్మానంలో పేర్కొన్నారు. పలు సమస్యలపై తీర్మానాలు చేశారు.

జిల్లా కార్యవర్గం ఎన్నిక

మహాసభలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు జిల్లా గౌరవాధ్యక్షులుగా జి రమణ, అధ్యక్షులుగా ఎం.ధనలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి ప్రేమలత, ప్రధాన కార్యదర్శిగా ఏవీఎన్ కుమారి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా టీ.శివపార్వతి, కోశాధికారిగా ఈ రత్నమంజుల, ఉపాధ్యక్షులుగా వి.విజయలక్ష్మి, రుక్మిణి, రజిని, టి పద్మావతి, ఓ రోజమ్మ కార్యదర్శులుగా కె ఎలిజబెత్, హేమలత, అస్మత్ తార, కే పద్మ, ఎస్ కే షాహిదా ఎన్నికయ్యారు. మరో 18 మంది జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నికైనట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు 19 మందికి అర్హత



అర్హత సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తూములూరు(కొల్లిపర): ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి 69వ ఎస్‌జీఎఫ్ అండర్-19 సైక్లింగ్ పోటీలు మండల పరిధిలో తూములూరు గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్లేస్‌లో గురువారం ఎంఈఓ-2 ఝాన్సీలత, అండర్-19 స్కూల్ గేమ్స్ సెక్రటరీ నరసింహారావు సమక్షంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు 19 మంది అర్హత సాధించినట్లు తెలిపారు. 19 మంది విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం కె.నాగలక్ష్మి, పిట్టలవానిపాలెం గవర్నమెంట్ కాలేజి ఫిజికల్ డైరెక్టర్ ఎస్.సుధాకర్‌రెడ్డి, గుంటూరు సైక్లింగ్ కోచ్ కనకారావు, పీఈటీ కవి, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.సాంబశివరావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

అక్టోబర్ 6 నుంచి మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ

కొరిటెపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో అక్టోబర్ 6వ తేదీ నుంచి మగ్గం వర్క్, 13వ తేదీ నుంచి బ్యూటీషియన్ కోర్సు, సెల్‌ఫోన్ రిపేర్, సర్వీసింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ టి.సందీప్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వయస్సు 19 నుంచి 45 సంవత్సరాలలోపు ఉండాలని సూచించారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనంతో పాటు వసతి కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు కొత్తపేటలోని సంస్థ కార్యాలయంలో ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, ఓల్డ్ బ్యాంక్ వీధి, కొత్తపేట, 0863-2336912, 9700687696, 8125397953, 9949930155 నెంబర్లను సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

గంజాయి కేసులో నిందితునికి జైలు

గుంటూరు లీగల్: గంజాయి స్వాధీనం చేసుకున్న కేసులో నిందితుడు ఏలూరు సత్రంపాడకు చెందిన వల్లముల హనుమంతరావుకు గుంటూరు ఒకటో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి వీఏఎల్ సత్యవతి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు విచారణ అధికారి ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటరెడ్డి, గుంటూరు-1 స్టేషన్ ఇన్‌స్పెక్టర్ లత సిబ్బందిని గుంటూరు జిల్లా డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ కమిషనర్ రవి కుమార్ రెడ్డి, జిల్లా ఎక్సైజ్ అధికారి అరుణకుమారి అభినందించారు.

జిల్లా విజిలెన్స్ బాండెడ్ లేబర్ సభ్యుల నియామకం

నెహ్రూనగర్: గుంటూరు జిల్లా విజిలెన్స్ బాండెడ్ లేబర్ సభ్యులుగా గుంటూరు నగరానికి చెందిన గండి కోటేశ్వరరావు, ఈమని చంద్రశేఖర్ నియమిస్తూ కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఎ.గాయత్రీ దేవి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీతారాం ఏచూరి స్ఫూర్తితో మతోన్మాదంపై పోరాడాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజి



ఏచూరి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించి, పుస్తకావిష్కరణ చేస్తున్న సీపీఎం నాయకులు

లక్ష్మీపురం: సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి స్ఫూర్తితో మతోన్మాదంపై పోరాడాలి అని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. గుంటూరు బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 'సీతారాం ఏచూరి ఓ సోషలిస్టు ఆచరణ పథం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.భావన్నారాయణ, వై.కృష్ణకాంత్, బి.ముత్యాలరావు, ఎం.ఎ చిష్టీ, కె.నాగేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, ఎం.కిరణ్, ఎం.సాంబశివరావు, జి.వెంకట్రావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.